సాక్షి
నిజామాబాద్
గురువారం । 8 । జూన్ । 2023



అన్నదాతల అభివృద్ధికి..
రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.
- 8లో ▸



మద్దతు ధర పెంపు
వరి, మొక్కజొన్న ఇతర పంటలకు మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.5 /30.0

వాతావరణం
ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతం కావొచ్చు. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

11న కవి సమ్మేళనం

సుభాష్‌నగర్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న కవి సమ్మేళనం, ముషాయిరా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య దినోత్సవంలో భాగంగా నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'ఉద్యమ తెలంగాణ–ఉజ్వల తెలంగాణ' అనే అంశంపై ఉదయం 9:30 గంటలకు జిల్లా స్థాయి కవి సమ్మేళనం ఉంటుందన్నారు. సమ్మేళనంలో పాల్గొనే కవులు మూడు పద్యాలను లేదా 20 పంక్తులను మించని వచన కవితను చదవవాల్సి ఉంటుందని వివరించారు. తమ రచనల్లో ఎటువంటి వివాదాస్పద అంశాలు లేకుండా చూడాలని, పాస్‌పోర్టు సైజు ఫొటోతో సహా తమ రచనను, హామీ పత్రాన్ని జూన్ 9లోగా డీపీఆర్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కవి సమ్మేళన నిర్వహణ బాధ్యతను వి త్రివేణి (9951444803), గంట్యాల ప్రసాద్ (9440356306), కాసర్ల నరేశ్ రావు (9441406252), తిరుమల శ్రీనివాస్ ఆర్య (8374002227), మద్దుకూరి సాయిబాబు (8897213286), ఘనపురం దేవేందర్ (9948032705)తో కూడిన కమిటీ చూస్తుందని తెలిపారు. ముషాయిరా కార్యక్రమం కూడా న్యూ అంబేద్కర్ భవన్‌లో 11న సాయంత్రం 7.00 గంటలకు ప్రారంభం అవుతుందని కలెక్టర్ తెలిపారు. ముషాయిరాలో పాల్గొనే కవులు ఉర్దూ ఆఫీసర్ అర్షద్ (8555805866), డీపీఆర్‌వో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మాజిద్ (99493 51684)ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్'

డొంకేశ్వర్(ఆర్మూర్) : మత్స్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్' గురువారం ప్రారంభం కానుంది. దీనిని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో మొత్తం 20 రకాల స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఫిష్ బిర్యానీ, ఫిష్ కర్రీ, ఫిష్ ఫ్రై, ఫిష్ పకోడి, ఫిష్ పచ్చళ్లు, ఫిష్ కోస్తా లాంటి వివిధ వంటకాలను ఇందులో ప్రదర్శించనున్నారు. మొదటి రోజు చేపల ఉత్పత్తుల ఆహార పండుగ, సాంస్కృతిక కార్యక్రమాలు, చేపల సాగుపై సెమినార్ నిర్వహిస్తారు. అలాగే 9న ఔత్సాహిక మహిళలకు చేపలు, రొయ్యల వంటకాలపై పోటీలు ఉంటాయి. మూడవ రోజు 10న చేప ఆధారిత ఉత్పత్తులుపై సాంకేతిక సెమినార్‌తో పాటు వంటకాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుంది. ఈ 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్'ను జిల్లా మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య పర్యవేక్షిస్తున్నారు.

నేడు దోస్త్ స్పెషల్ కేటగిరి విద్యార్థుల సర్టిఫికెట్ పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల్లో భాగంగా దోస్త్– 2023 స్పెషల్ కేటగిరికి సంబంధించిన పీహెచ్/ సీఏపీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ గురువారం(8న) నిర్వహించనున్నట్లు తెయూ దోస్త్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా భవనంలోని డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్స్ పరిశీలన జరుగుతుందన్నారు. అలాగే జూన్ 9న ఎన్‌సీసీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ కలిగిన విద్యార్థులు సర్టిఫికెషన్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు www.telanganauniversity.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై నేడు సమావేశం

నిజామాబాద్‌అర్బన్ : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. ఈ నెల 12 నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో ఖిల్లా జూనియర్ కళాశాలలో సమావేశం ఉంటుందన్నారు. పరీక్షల కోసం జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ)–2024 శిక్షణ కోసం కోసం ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షల లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి హైదరాబాద్ రాజేంద్రనగర్ గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత భోజన వసతితో శిక్షణ ఇస్తారన్నారు.

నగరంపై ఫోకస్

- నేటి నుంచి జూలై 15వరకు డివిజన్ల వారీగా హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమం
- ఎన్నికలు సమీపిస్తుండడంతో స్పీడ్ పెంచిన నగర కాంగ్రెస్
- ఇప్పటికే జిల్లాలో రేవంత్ పాదయాత్ర. ఆపై కర్ణాటక విజయంతో ఉత్సాహం



నగరంలో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మానాల, కేశ వేణు, తాహెర్ బిన్ హందాన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తోంది. నిజామాబాద్ నగరంపై మరింత ఫోకస్ పెంచింది. ఇందులో భాగంగా బుధవారం నగర పార్టీ అధ్యక్షుడు కేశ వేణు ఆధ్వర్యంలో హాథ్‌సే హాథ్ జోడో యాత్ర షురూ చేశారు. ఏకధాటిగా వచ్చే నెల 15 వరకు 60 డివిజన్లు చుట్టివచ్చేలా కార్యక్రమాలు రూపొందించారు. ఇప్పటికే రేవంత్ పర్యటన తర్వాత టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీక్ విషయమై సైతం పార్టీ శ్రేణులు ఆందోళనలు చేశాయి. పెట్రో ధరల పెంపుపై కూడా ఆందోళనలు చేశారు.

బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య రహస్య దోస్తీ : కేశ వేణు

హాథ్‌సే హాథ్ జోడో యాత్ర ద్వారా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాం. ఇప్పటికే రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర లక్ష్యం నెరవేరుతూ వస్తోంది. రాహుల్ యాత్ర తరువాత మొదట హిమాచల్‌ప్రదేశ్‌లో, తరువాత కర్ణాటకలో కాంగ్రెస్ అధికార పీఠం చేజిక్కించుకుంది. తదుపరి జరుగనున్న తెలంగాణ, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుంది. తెలంగాణలో రహస్యంగా దోస్తీ చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కర్ణాటక తరహా ఫలితాలు తెలంగాణలో పునరావృతం అవుతాయి. కర్ణాటకలో 40 శాతం కమీషన్ ప్రభుత్వం గద్దె దిగిన మాదిరిగా తెలంగాణలో కేసీఆర్ అవినీతి కుటుంబ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. కర్ణాటక విజయంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం వచ్చింది. తెలంగాణలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యం.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేస్తామని చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, 18 ఏళ్లు దాటిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు అందించడంతో పాటు వివిధ సంక్షేమ పథకాల వివరాలను కరపత్రాల్లో ముద్రించారు. ఈ నేపథ్యంలో నగరంలో నేతలందరూ కలసికట్టుగా ముందుకు వెళ్లేందుకు కార్యాచరణ రూపొందించుకున్నట్లు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ చెబుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుని ఉందంటున్నారు. కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో పాటు ప్రజల్లో అసంతృప్తిని గ్రహించిన కేసీఆర్ కాంగ్రెస్ పార్టీ గురించి ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ప్రజల్లో మార్పు మొదలైందని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించుతారని అంటున్నారు.

ఇక్కడా కర్ణాటక ఫలితాలే..

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్
- నిజామాబాద్ అర్బన్‌లో గడపగడపకూ కాంగ్రెస్ ప్రారంభం

సుభాష్‌నగర్ : తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో కర్ణాటక ఫలితాలే పునరావృతం కానున్నాయని, సీఎం కేసీఆర్ ఎన్ని మాయమాటలు చెప్పినా.. ప్రజలు నమ్మే పరిస్థితి లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని గోల్‌హనుమాన్ వద్ద గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమం ముదిరాజ్ వీధి నుంచి పోచమ్మ గల్లీ వరకు కొనసాగింది. పెద్ద పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘం చౌరస్తాలో సమావేశం ఏర్పాటు చేశారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని, ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగాలు వస్తాయని టీఆర్‌ఎస్‌కు ఓటేశామని, కానీ కేవలం కల్వకుంట్ల కుటుంబానికే ఉద్యోగాలు దక్కాయని విమర్శించారు. దేశంలోనే అత్యధిక ధనిక సీఎం కేసీఆర్ అని, సుమారు రూ.3లక్షల కోట్లకు పైగా ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. వైఎస్ పాలనలో ప్రతి హామీని నెరవేర్చామని గుర్తుచేశారు.

దేవుడి పేరుతో ఓట్ల రాజకీయం..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేవుడి పేరుతో ఓట్ల రాజకీయాలకు పాల్పడుతోందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. దోపిడీ ఆగాలంటే కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో కేడీ కేసీఆర్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

నిత్యావసర ధరలు ఆకాశానికి..

తొమ్మిదేళ్ల ఏళ్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా, ఎమ్మెల్సీ కవిత ఆస్తులు విపరీతంగా పెరిగిపోయాయని, కానీ నగర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సిలిండర్ రూ.500కు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.5లక్షలు, 2లక్షల ఉద్యోగాల భర్తీ, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను అమలు చేస్తామన్నారు. జూలై 15 వరకు గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. నాయకులు నగేశ్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి, జావిద్ అక్రమ్, విపుల్ గౌడ్, వేణురాజ్, వేముల దేవిదాస్, రామకృష్ణ, ఇర్ఫాన్ అలీ పాల్గొన్నారు.



గోల్‌హనుమాన్ వద్ద గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఎస్సారెస్పీకి పునరుజ్జీవం పోశాం



మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- సాగునీటిలో ప్రగతి సాధించాం
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రత్యేక రాష్ట్రంలో పునరుజ్జీవం పోశామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ముప్కాల్ శివారులో వరద కాలువ జీరోపాయింట్ వద్ద నిర్వహించిన సాగునీటి దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీకి జీవం పోయాలని తలచి ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం ప్రారంభించారన్నారు. 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని తీసుకు రావడం మాములు విషయం కాదన్నారు. రైతులకు మేలు చేయాలనే తపన ఉన్న నాయకుడు కేసీఆర్ అన్నారు. వరద కాలువలో, కాకతీయ కాలువలో నీరు సమృద్ధిగా ఉందన్నారు. దీంతో కాలువలకు ఇరువైపుల మూడు కిలోమీటర్ల వరకు భూగర్భ జలాలు వృద్ధి చెందాయని చెప్పారు. అధికారంలో ఉండగా రైతుల కోసం పట్టించుకోని కొన్ని పార్టీల నాయకులు కేసీఆర్‌ను విమర్శించడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా మంత్రికి బోనాలతో స్వాగతం పలికారు.

కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు దాసరి లావణ్య, బద్దం నర్సవ్వ, తలారి గంగాధర్, ఎంపీపీలు లావణ్య, సామ పద్మ, సుకన్య, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వరంతో జిల్లాకే ఎక్కువ లబ్ధి

- ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల, టీఎస్‌డబ్ల్యూడీసీ చైర్‌పర్సన్ లలిత

నిజామాబాద్‌నాగారం : కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎక్కువ లబ్ధి పొందింది నిజామాబాద్ జిల్లా అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిజామాబాద్ నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాగునీటి దినోత్సవానికి ఆమె హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ దేశానికే గర్వకారణమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన చేసే సమయంలో రిజర్వాయర్ల నిర్మాణం, కాలువల తవ్వకం వంటి ప్రతీ చిన్న అంశాన్ని కేసీఆర్ క్షుణ్ణంగా అధ్యయనం చేశారన్నారు. ప్రాజెక్టులో భాగంగా ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం తీసుకొచ్చామని, హల్దీవాగుతో నిజాంసాగర్ నింపుకుంటున్నామని చెప్పారు. కాళేశ్వరం నిర్మాణం విషయంలో కేసీఆర్ పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో కూడా భేటీ అయ్యి ఒప్పించారని గుర్తు చేశారు. ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు నిజమైన రాజకీయ నాయకుడన్నారు. నిజామాబాద్ జిల్లాలో లక్షా 81 వేల ఎకరాలు కాళేశ్వరం జలాలతో సాగవుతాయని తెలిపారు. చెక్ డ్యాముల నిర్మాణంతో జిల్లాలో భూగర్భ జల మట్టం 15 మీటర్లు పెరిగిందన్నారు. ఆంధ్రా పాలకులు తెలంగాణ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు చేయలేదని విమర్శించారు. ప్రాణహిత చేవెళ్ల కాలువలు తొవ్వి రూ.వేల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. అప్పటి కాంగ్రెస్ పాలనలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డి ఉన్నప్పుడే ఈ ఘోరాలు జరిగాయన్నారు. అప్పటి పాలకుల చేతిలో సుదర్శన్‌రెడ్డి కీలుబొమ్మగా ఉండేవారన్నారు. అంతకుముందు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఉత్తమ అధికారులను సత్కరించారు.

నీటి సమస్యలు లేకుండా చేశాం

నిజామాబాద్ నగరంలో నీటి సమస్య లేకుండా ఎమ్మెల్సీ కవిత సహకారంతో రూ.97కోట్లతో మంచినీటి ట్యాంకులు నిర్మించామని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా తెలిపారు. రూ. 20కోట్లతో పైప్‌లైన్ నిర్మించామని, రూ. 1000 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు రాకుండా ఫీడర్ ఏర్పాటు చేశామన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, టీఎస్ డబ్ల్యూడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా కమిషన్ సభ్యురాలు సూదంలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే బిగాల

కొత్తవారికి రైతుబంధు అందేనా!

- యాసంగిలో 7,176 మందికి ఇవ్వని ప్రభుత్వం
- వానాకాలంలో ఇస్తారని ఆశలు పెట్టుకున్న రైతులు
- వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

డొంకేశ్వర్(ఆర్మూర్) : 'రైతుబంధు' నిధుల కోసం కొత్త రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. గతేడాది జిల్లాలో 7,176 మంది కొత్త పట్టాదార్లను గుర్తించగా, వీరికి యాసంగిలోనే పంట పెట్టుబడి సాయాన్ని అందించాల్సి ఉంది. కానీ, వివిధ కారణాలతో డబ్బులు జమ కాలేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌కైనా పాత రైతులతో కలిసి'రైతుబంధు' సాయం ఇస్తారని కొత్త రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూస్తే ఈ సీజన్లో కూడా డబ్బులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎందుకంటే కొత్త పట్టాదార్ల వివరాలను వ్యవసాయాధికారులు ఇప్పుడిప్పుడే ఆన్‌లైన్ చేస్తున్నారు. ప్రభుత్వం ఆదేశాలు, మార్గదర్శకాలు ఇవ్వకున్నా, డేటాను సిద్ధం చేస్తున్నారు. ఒక వేళ ప్రభుత్వం కొత్త రైతులతో కలిపి పెట్టుబడి సాయాన్ని ఇస్తే జిల్లాలో మొత్తం పట్టాదార్ల సంఖ్య 2,78,351కు చేరనుంది. ఇందుకు గాను రూ.274.10కోట్లకు పైగా బడ్జెట్ అవసరం కానుంది. గడిచిన ఈ ఆరు నెలల్లో కూడా వ్యవసాయ భూములకు కొత్త పట్టాలు చాలనే అయ్యాయి. తద్వారా 7,176 ఉన్న కొత్త పట్టాదార్ల సంఖ్య పది వేలకు చేరువయ్యే అవకాశముంది.

సాగు మొదలైంది.. సాయమెప్పుడో!

రైతులకు పంట పెట్టుబడి భారం కాకుండా ప్రభుత్వం ఐదేళ్ల నుంచి 'రైతుబంధు' పథకం కింద సాయాన్ని అందజేస్తోంది. ప్రతీ సీజన్‌కు ఎకరానికి రూ.5వేల చొప్పున ఏడాదికి రూ.10వేలు ఇస్తోంది. తొలుత 2లక్షల పైచిలుకున్న పట్టాదార్ల సంఖ్య క్రమేపీ 2.70లక్షలు దాటింది. అయితే, జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఖరీఫ్ పనులు మొదలయ్యాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు బిజీగా ఉన్నారు. విత్తనాలు వేసేందుకు ట్రాక్టర్లతో పంట పొలాలను దుక్కి దున్నుతున్నారు. కొన్ని చోట్ల పసుపు సాగు మొదలైంది. బోధన్ డివిజన్లో వరినార్లు పోసుకుని నాట్లు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. కానీ, ఇప్పటి వరకు పంట పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ కాలేదు. జూన్ రెండో వారంలో డబ్బులు చేతికి అందితేనే పంటల పెట్టుబడికి ఎలాంటి ఇబ్బందులుండవని రైతులు పేర్కొంటున్నారు. కానీ, పరిస్థితి చూస్తుంటే ఈ నెలాఖరు, జూలై వరకు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఈ అంశంపై మాట్లాడటానికి వ్యవసాయ అధికారులు ముందుకు రావడం లేదు.

భూ సేకరణతోనే సరిపెట్టారు

- స్పైసిస్ పార్క్ కోసం 75 ఎకరాలు సేకరణ
- ప్రహరీ, రోడ్లు నిర్మించి వదిలేసిన వైనం
- పసుపు క్రయవిక్రయాలు ప్రారంభించాలని కోరుతున్న రైతులు



వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద స్పైసిస్ పార్క్

మోర్తాడ్ : పసుపు అమ్మకాలు, కొనుగోళ్ల కోసం నిర్దేశించిన స్పైసిస్ పార్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణతోనే సరిపెట్టిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పసుపు బోర్డు ఏర్పాటు డిమాండ్‌ను కేంద్రం తోసిపుచ్చడంతో తామే స్వయంగా రంగంలోకి దిగి పసుపు రైతుల ప్రయోజనాలను కాపాడుతామని గతంలో సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా మన జిల్లాలో స్పైసిస్ పార్క్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.30.81 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది. స్పైసిస్ పార్క్ కోసం వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 75 ఎకరాల భూమిని సేకరించారు. ప్రహరీతోపాటు, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. షెడ్‌ల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీ, గోదాంల నిర్మాణం, రైతులు, వ్యాపారులకు విశ్రాంతి గదులు, పసుపు ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మించాల్సి ఉంది. ఉద్యానవన, సెరికల్చర్ శాఖలు సంయుక్తంగా ఈ స్పైసిస్ పార్క్‌ను పర్యవేక్షించాల్సి ఉండగా, ఇతర కార్యకలాపాలను రాష్ట్ర పరిశ్రమల కార్పొరేషన్ నిర్వహించాల్సి ఉంది. 2016లోనే భూసేకరణ పూర్తి చేశారు. స్పైసిస్ పార్క్ కార్యాచరణకు మాత్రం ఇప్పటికి అడుగులు ముందుకు పడలేదు. నిజామాబాద్, సాంగ్లీ మార్కెట్‌లలో పసుపు పంటకు ఆశించిన ధర లభించడం లేదు. పసుపు ఆధారిత పరిశ్రమలను స్థానికంగా ఏర్పాటు చేసి మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తే పంటకు కొంతైనా ధర పెంచి రైతులకు లాభాలను అందించవచ్చనే అభిప్రాయం వ్యక్తమైతుంది. పసుపు రైతులను కేంద్రం పట్టించుకోకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుంటే ఎంతో మేలు అని అందరు ఊహించారు. కార్యాచరణ ఆరంభించకపోవడంతో రైతులకు నిరాశే మిగిలింది. దశాబ్ది సంబరాల సందర్భంగానైనా స్పైసిస్ పార్క్ లక్ష్యాలను నెరవేర్చే కార్యక్రమానికి బీజం వేయాలని పలువురు కోరుతున్నారు.

కొనుగోళ్లు జరిపించాలి



పసుపు అమ్మకాలు, కొనుగోళ్లను వచ్చే సీజనులోనైనా ఆరంభించాలి. స్పైసిస్ పార్క్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ఆశించాం. చివరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులకు ప్రయాస తప్పడం లేదు.
– గురిజాల నర్సయ్య, రైతు, శెట్‌పల్లి

రాష్ట్ర ప్రభుత్వం కూడా నీరుగార్చింది



పసుపు రైతులను కేంద్రం వంచించింది. రాష్ట్ర ప్రభుత్వం తీరుకూడా అలాగే ఉండటంతో రైతులకు నిరాశే మిగిలింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్పైసిస్ పార్క్‌లో కార్యాచరణ మొదలు పెట్టాలి.
– నుంకెట అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్

వైద్యుల డుమ్మాకు ఇక చెక్

- హాజరును పర్యవేక్షించనున్న జాతీయ వైద్య కమిషన్
- జీజీహెచ్, మెడికల్ కాలేజీల్లో బయోమెట్రిక్ మిషన్ల ఏర్పాటు



మెడికల్ కళాశాలలోని బయోమెట్రిక్ మిషన్లలో పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది

నిజామాబాద్ సిటీ : బోధన ఆస్పత్రుల్లో పని చేసే వైద్యుల సమయపాలనపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) దృష్టి సారించింది. ఇప్పటి వరకు వీరి హాజరును రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఈ గవర్నెన్స్ విభాగం ద్వారా ఎన్ఐసీ ఏజెన్సీ పర్యవేక్షించేది. ఇక నుంచి జాతీయ స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్ల వరకు హాజరును పర్యవేక్షించాలని ఎన్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం నిజామాబాద్‌కు మొత్తం 10 బయోమెట్రిక్ మిషన్లు పంపింది. ఇందులో ఏడు మిషన్లను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో, మూడింటిని మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్లలో బొటన వేలు పెడితే హాజరు నమోదు అయ్యేది. కొత్త మిషన్లలో వేలు పెడితే ముఖం కనబడేలా రూపొందించారు. దీంతో వైద్యులు, సిబ్బంది హాజరు పక్కాగా నమోదు అయ్యే అవకాశం ఉంది. ఎన్ఎంసీ ఆధ్వర్యంలో వైద్యుల హాజరు నమోదు కానుండటంతో సమయపాలన పాటించని వైద్యులు మల్లగుల్లలు పడుతున్నారు.

పక్కాగా హాజరు నమోదు

ఆస్పత్రి, మెడికల్ కళాశాలలకు సంబంధించి వైద్యుల హాజరు ఇక నుంచి పక్కాగా నమోదు కానుంది. ఎన్ఎంసీ నుంచి మొత్తం 10 బయోమెట్రిక్ మిషన్లు వచ్చాయి. వాటిలో వైద్యుల వివరాలు నమోదు చేయిస్తున్నాం.
– డాక్టర్ ఇందిర, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో మిగిలిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ జిల్లా సమన్వయకర్త సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు www. tswreis. ac. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫీజు రూ.100 చెల్లించి, ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతిలో పొందిన జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారని తెలిపారు.

స్వయం ఉపాధి శిక్షణకు..

డిచ్‌పల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) డిచ్‌పల్లి, ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సెల్‌ఫోన్ రిపేర్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సుల్లో 30రోజుల ఉచిత శిక్షణతోపాటు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ధృవీకరణపత్రం అందిస్తారని తెలిపారు. 19–40 వయస్సు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 10వ తరగతి ధృవీకరణ పత్రాలతో పాటు ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు ఎస్‌బీఐ శిక్షణ కేంద్రం, డిచ్‌పల్లిలో, లేదా ఫోన్ నెంబర్ 08461–295428ను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

డిచ్‌పల్లి: వానాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పిల్లలు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని డీఎంహెచ్‌వో సుదర్శనం సూచించారు. మండల కేంద్రంలోని మానవత సదన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ప్రతి నెలా పిల్లలకు మందులు అందుతున్నాయా లేదా అని వారి ఆరోగ్య విషయాలను కేర్‌టేకర్ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలో సదన్‌లో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయత్ రాజ్ ఇంజినీరింగ్ శాఖ
జిల్లా పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం (PIU), నిజామాబాద్ జిల్లా
ప్రకటన

మల్లాపూర్ నుండి చల్లగర్గ వయా లోలం, గోవింద్‌పల్లి, బిలియా తాండ, దమ్మన్నపేట్ నిజామాబాద్ జిల్లాలో రహదారిపై మెరుగుదలలు కి.మీ. 2/075 నుండి 4/250 వరకు గల రహదారి నిర్మాణం భాగంగా రేంజ్‌లోని కంపార్ట్‌మెంట్ నెం. 172/1 నిజామాబాద్ జిల్లాలో 1.522 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించడానికి స్టేజ్ – 1 (మూడు సార్లు) ఆమోదం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ PR నిజామాబాద్‌కు అనుకూలంగా, ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీసర్ PR, MoEF & CC, భారత ప్రభుత్వం, F.No.4-TSB224/2021-Hyd, 21.08.2022 పొందడం జరిగింది. ప్రాజెక్ట్ వివరాలను మంత్రిత్వశాఖ పోర్టల్‌లో ప్రతిపాదన సంఖ్యా RC No. 921/2021/D5
Date: 01.2023లో చూడగలరు.
NIT No: T1/2023-24,Date:03.06.2023
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డివిజన్, నిజామాబాద్

జవాన్‌లను ఆదుకున్న దేశభక్తుడు కేసీఆర్

- డివిజన్‌లలో సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- నగరంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్‌నాగారం: జై జవాన్.. జై కిసాన్.. అని అందరూ నినాదాలు చేస్తుంటారు. కానీ నినాదాలతోపాటు జవాన్లను, రైతులను ఆదుకున్న నిజమైన దేశభక్తుడు సీఎం కేసీఆర్ అని, పక్కా రాష్ట్రాల జవాన్‌లను సైతం ఆదుకున్నాడని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ విజయలక్ష్మీగార్డెన్‌లో బుధవారం 6, 21, 22, 23, 24, 45 డివిజన్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కవిత హాజరై మాట్లాడారు. జై జవాన్.. జై కిసాన్.. నినాదంలో భాగంగా రాష్ట్రంలో 65లక్షల రైతులకు రూ. 60వేల కోట్ల నిధులతో ఆదుకున్నామన్నారు. అలాగే పక్క రాష్ట్రాలలో మృతిచెందిన జవాన్ల కుటుంబాలను ఆదుకున్నామన్నారు. నిజామాబాద్‌లో అన్ని పార్టీలు గులాబీ కండువా కప్పుకోవాల్సిందేన్నారు. అర్బన్‌లో బిగాల వినాయకుడిలా రాష్ట్రంలో తొలి విజయం అందుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు 100శాతం గులాబీమయమే అన్నారు. నగరంలో ఆయా డివిజన్‌లల్లో సోషల్ మీడియా గ్రూపులు పెట్టుకోవాలని, బీజేపీ, కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు నిజాలు చెప్పాలని అన్నారు.

ఎంపీగా కవితను భారీ మెజార్టీతో గెలిపిద్దాం..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను వచ్చే ఎన్నికల్లో ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపిద్దామని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా తెలిపారు. మూడోసారి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురవేయాలన్నారు. నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. మేయర్ నీతూకిరణ్, ఉమెన్ వెల్ఫేర్ చైర్మన్ ఆకుల లలిత, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ రెడ్కో చైర్మన్ ఎస్‌ఏ అలీం, నాయకులు సుజిత్‌సింగ్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

పాండురంగ ఆలయంలో పూజలు



మాక్లూర్: మండల కేంద్రంలోని రుక్మిణి పాండురంగ విఠలేశ్వర, అయ్యప్ప, ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, అతని సోదరుడు మహేష్‌గుప్తాలు ఈ ఆలయాన్ని పునఃనిర్మించి, ఇటీవల ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి అప్పట్లో కవితను ఆహ్వానించినప్పటికీ అనివార్య కారణాలవల్ల ఆమె రాలేకపోయారు. దీంతో బుధవారం సమయం కలిసి రావటంతో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి, మేయర్ నీతూకిరణ్‌లతో కలిసి మాక్లూర్‌కు చేరుకొని ఆలయంలో పూజలు చేశారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, నాయకులు సత్యం, మల్లారెడ్డి, రంజిత్, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామానికి చెందిన క్యామాజి లలితమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకుని ఓదార్చారు.

మంత్రి గారూ..! పేద కుటుంబాన్ని ఆదుకోండి!



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి కుటుంబాన్ని ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం అతలాకుతలం చేసింది. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో ముగ్గురు కుమార్తెల భవిష్యత్ అంధకారమైంది. దీంతో నిరుపేద లక్ష్మి కుటుంబాన్ని ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మామిడిరాజు, అంగుళి మాలాజి, దేవా పద్మారావు, సత్యనారాయణ కోరారు. ఈమేరకు వారు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ.. లక్ష్మి భర్త కొంతం రవికుమార్ (44) ఉపాధి కోసం మూడేళ్ల గల్ఫ్‌కు వెళ్లి, పరిస్థితి అనుకూలించక ఇటీవల ఇంటికి వచ్చాడన్నారు. గత నెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడన్నారు. ఆ సమయంలో అతడి జేబులో రూ. 50వేలు విలువగల గల్ఫ్ కరెన్సీ నోట్లు ఉండగా, వాటిని దొంగలించారన్నారు. ప్రస్తుతం డిగ్రీ, ఇంటర్మీడియట్, ఎస్సెస్సీ చదువుతున్న రవికుమార్ కుమార్తెల చదువు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి స్పందించి రవి కుమార్తెలకు ఉచితంగా చదువు చెప్పించాలని, దళితబంధు పథకం ద్వారా ఆ కుటుంబానికి ఆసరా కల్పించాలని కోరారు.

అన్నదాతల అభివృద్ధికి పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

వర్ని: రాష్ట్రంలో అన్నదాతల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ వద్ద బుధవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాగునీటి సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి స్పీకర్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. రైతు అభివృద్ధిలో భాగంగానే పంటకు పెట్టుబడి సాయం కింద సంవత్సరానికి రూ.10వేలు, సబ్సిడీపై విత్తనాల అందజేత, ధాన్యం కొనుగోలు, దళారి వ్యవస్థకు అడ్డుకట్టలు వేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులు, రైతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ, కృషి చేస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో సాగునీటి నిల్వలు పెంచడానికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేస్తూ రాష్ట్రం నలుమూలల సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సిద్ధాపూర్ ప్రాంతంలో సాగునీటి ఎద్దడిని నివారించేందుకు రూ.32కోట్లతో రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు సిద్ధమవుతున్నాయని, దీనిని బట్టి చూస్తే దేశానికి రాష్ట్రం మోడల్‌గా తయారయిందని అన్నారు. జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్, వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, జెడ్పీటీసీ హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

వరి, మొక్కజొన్నలకు మద్దతు ధర పెంపు

మోర్తాడ్(బాల్కొండ): రానున్న వర్షాకాలం, యాసంగి సీజనులకు సంబంధించి వరి, మొక్కజొన్న ఇతర పంటలకు మద్దతు ధరలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పంటల సాగుకు రైతులు పెడుతున్న పెట్టుబడులను దృష్టిలో ఉంచుకుని మద్దతు ధరలను పెంచడం గమనార్హం. వరికి రూ.143 చొప్పున, మొక్కజొన్న పంటకు రూ.128 చొప్పున మద్దతు ధర పెంచడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. గత సీజనులతో పోల్చితే ఈసారి మద్దతు ధర ఎక్కువగానే పెంచారని రైతు నాయకులు వెల్లడిస్తున్నారు. గడచిన సీజనులో వరి ఏ గ్రేడ్ రకానికి రూ. 2,060, బీ గ్రేడ్ రకానికి రూ.2,040 లభించింది. ప్రస్తుతం రెండు రకాలకు రూ.143 పెంచడంతో ఏ గ్రేడ్ ధాన్యంకు రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యంకు రూ. 2,183 ధర పలుకనుంది. మొక్కజొన్నకు ఇప్పటి వరకు క్వింటాలుకు రూ. 1,962 ధర లభించింది. ఇక నుంచి రూ.2,090 ధర పలుకనుంది. ఇదిలా ఉండగా సోయాకు మద్దతు ధర గతంలో రూ.4,300లు ఉండగా ఏకంగా మద్దతు ధర రూ.300లు పెరిగింది. ఈసారి మద్దతు ధరలను రూ.వందకు పైగా పెంచడంతో రైతులకు ఊరటనిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కలుషిత ఆహారంపై అవగాహన కల్పించాలి



నిజామాబాద్‌నాగారం: అపరిశుభ్రత, కలుషిత ఆహారం వల్లే కలిగే అనార్థాలను ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావర్ రాజేశ్వర్ పేర్కొన్నారు. నగరంలోని గాంధీగంజ్‌లో బుధవారం జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారి నాయక్ అధ్యక్షతన 'ప్రపంచ ఆహార భద్రత పరిరక్షణ దినోత్సవం' నిర్వహించారు. ఈసందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఆహార పదార్థాలను కల్తీ చేసే వారిపై ప్రభుత్వం ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధించడానికి వీలుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాలకు కేటాయించిన ఫుడ్ సేఫ్టీ వ్యాన్ నిజామాబాద్ జిల్లాకు వచ్చిందని, ఎక్కడైనా కల్తీ జరిగితే దీంతో పరీక్ష చేయించుకోవచ్చన్నారు. కామారెడ్డి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, మాజీ కార్పొరేటర్ వల్లభ, శ్యామ్ తివారి, రంజిత్, శేఖర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన వివాహిత ఒన సుశీల(35) అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 6న సుశీల ఆస్పత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లింది. ఇప్పటికీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె తండ్రి సాయన్న ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

డీసీఎంను ఢీకొన్న ఆటో: పలువురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ రాజు

ఆర్మూర్‌టౌన్: ఆగిఉన్న డీసీఎం వ్యానును వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొనడంతో పలువురికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు తెలిపి న వివరాలు ఇలా.. బుధవారం మె ట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు ఆటో వస్తుండగా, కోటార్మూర్ ఫ్లైఓవర్ వద్ద అదుపుతప్పి ఆగిఉన్న డీసీఎంను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ రాజుతోపాటు ఆటోలో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురికి స్వల్ప గాయలు కావడంతో ప్రథమ చికిత్స చేశారు. డ్రైవర్‌ను మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే మరో ప్రయాణికుడిని మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. డ్రైవర్ తాగి ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్: ఇద్దరికి గాయాలు

వర్ని: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండిపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గండిపేట్‌కు చెందిన శివ, రా ములు ఇద్దరు బైక్‌పై వర్ని వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తులను, స్థానికులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఎల్ఐసీ బోనస్ పేరిట సైబర్ మోసం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తికి ఎల్ఐసీ బోనస్ వేస్తామంటూ, అతడి ఖా తా నుంచి సైబర్ మోసగాళ్లు నగదును అపహరించిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రామారెడ్డి గ్రామానికి చెందిన లాగాల నాగరాజుకు ఈనెల 6న ఎల్ఐసీ ఏజెంట్ పే రుతో ఫోన్‌కాల్ వచ్చింది. మీ అకౌంట్‌లో పాలసీ బోనస్ డబ్బును ఫోన్ పేలో జమ చేస్తామని సదరు ఏజెంట్ పేర్కొన్నాడు. దీంతో నాగరాజు స దరు ఏజెంట్ పంపిన కోడ్‌ను ఓకే చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి 4 విడతల్లో రూ.24వేల 570 చొప్పున మొత్తంగా రూ.98,250 విత్‌డ్రా అ య్యాయి. దీంతో మోసపోయానని గ్రహించిన నాగరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఏఎస్సై సుభాషిని తెలిపారు. ఎల్ఐసీ బ్రాంచ్ నుంచి ఏజెంట్ల నుంచి కేవైసీ కోసం మాత్రమే ఫోన్లు వస్తాయని, వ్యక్తిగత సమాచారం, కోడ్ పంపి ఓకే చేయమని అడగరని ఏజెంట్ ఆకుల ఉమాపతి తెలిపారు.

తొమ్మిది మంది రిమాండ్

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో దళిత యువకుడు కర్దూరం నందుని వేధించిన కేసులో గ్రామానికి చెందిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ బుధవారం తెలిపారు. నందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రధాన నిందితులు 9మందిని మంగళవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదెల మృతి

మోర్తాడ్: మేతకు వెళ్లిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందాయి. మోర్తాడ్‌కు చెందిన కుర్మ మహేందర్‌కు చెందిన గేదెలు మేత మేస్తుండగా.. తెగిపడిన విద్యుత్ తీగెలు గేదెలకు తగలడంతో షాక్‌తో మరణించాయి. గేదెల మృతితో పాడి రైతుకు రూ.80వేల నష్టం వాటిల్లింది.

ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ చోరీ

ఎల్లారెడ్డి: మండలంలోని కళ్యాణి ప్రాజెక్టు సమీపంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు ఆయిల్‌ను చోరీ చేసినట్లు రైతులు బుధవారం తెలిపారు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా కళ్యాణి ప్రాజెక్టు శివారులో గల 100, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు ఆయిల్‌ను చోరీ చేసినట్లు తెలిపారు. పోలీసులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్ చోరీ జరగకుండా తగిన చర్యలను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆలయాల్లో ..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండుగులు చోరీకి పాల్పడ్డారు. బ్రహ్మంగారి గుట్ట వద్ద గల జంభి హన్మాన్ ఆలయం, రామాలయం, వాసవీమాత ఆలయం, గుట్టపై గల పలు ఆలయాల తాళాలు పగులగొట్టి చిన్నచిన్న వస్తువులు చోరీకి పాల్పడ్డారు. హన్మాన్ ఆలయంలో 5 లీటర్ల దీపం నూనె, రామాలయంలో దేవతామూర్తుల వస్త్రాలు, వాసవీ మాత ఆలయంలో పూజా సామగ్రి వస్తువులను ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం దర్శనానికి వెళ్లిన భక్తులకు ఆలయాల తలుపులు తెరిచి ఉండడంతో చోరీ ఘటన వెలుగు చూసింది. పోలీసులకు సమాచారం అందించామని భక్తులు తెలిపారు.

మోసం చేసిన మద్యం సీసా..

- 'వైన్ గ్రూప్' సంస్థ పేరుతో బురిడీ
- జిల్లాలో వేల సంఖ్యలో బాధితులు
- రూ. కోట్లలో టోకరా
- వెలుగు చూసిన కొత్త మోసం



సంస్థకు చెందిన యాప్ ముఖచిత్రం

కామారెడ్డి క్రైం : తమ వైన్ బాటిల్ కంపెనీలో సభ్యులుగా చేరి పెట్టుబడులు పెడితే 60 రోజుల్లో మూడింతలు చెల్లిస్తామని, రోజువారీగా అకౌంట్‌లో డబ్బులు వేస్తామని నమ్మించిన ఓ కంపెనీ రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది డబ్బులు కాజేసినట్లు ఆరోపణలు వెలువడుతున్న విషయం తెలిసిందే. రూ. 470 నుంచి మొదలు పెడితే రూ. లక్షల్లో పెట్టుబడులు పెట్టుకునే విధంగా కంపెనీ అనేకరకాల ప్యాకేజీలను ప్రకటించి జనాన్ని ఆన్‌లైన్, వాట్సప్ గ్రూపుల ద్వారా ఆకర్షించింది. కంపెనీలో సభ్యుడిగా చేరిన వారు మరో 230 మందిని సభ్యులుగా చేర్పిస్తే నెలకు రూ. 20 వేలు జీతం ఇస్తామని, రూ. 85 వేలు పెట్టుబడి పెడితే ప్రతి రోజు రూ. 12 వేలు చొప్పున అకౌంట్లో వేస్తామని, రకరకాలుగా డబ్బు లు వేసే ప్యాకేజీలను చూపించి నమ్మించారు. కొద్ది రోజులు సక్రమంగానే డబ్బులు వేశారు. మే 31వ తేదీవరకు సభ్యులుగా చేరిన వారి అకౌంట్లలో ప్రతిరోజు డబ్బులు జమయ్యాయి. ఆ తర్వాత ఒక్కసారిగాలావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో నష్టపోయామని గుర్తించిన బాధితులు లబోదిబోమంటున్నారు.

బీర్షబాలాంటి మోసం..

కామారెడ్డి జిల్లాలో కూడా వైన్ బాటిల్ కంపెనీ బాధితులు వేల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. కేవలం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రాంతం నుంచే ఈ కంపెనీలో సభ్యులుగా చేరి దాదాపు 100 మంది వరకు బాధితులు ఉన్నట్లు తెలుస్తుంది. దాదాపు రూ. 50 నుంచి రూ. 60 లక్షల వరకు నష్టపోయినట్లు చెబుతున్నారు. జీవదాన్ ఆస్పత్రి ప్రాంతంలో ఉండే ఓ వ్యక్తి ఒక్కడే రూ. 4 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మరికొంత మందిని సభ్యులుగా చేర్పించాడు. అతనికి కొద్ది రోజులు రోజువారి డబ్బులు వచ్చినప్పటికి పెట్టిన పెట్టుబడిలో సగం వరకు నష్టం జరిగినట్లు తెలిసింది. అంతేకాకుండా చుట్టు పక్కల గ్రామాల వారు కూడా అనేక మంది సదరు కంపెనీలో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తుంది. సదరు కంపెనీ వ్యవహారాలు, లావాదేవీలు అనేక జిల్లాల్లో వ్యాపించి ఉన్నాయి. బాధితులు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. గతంతోనూ బీర్షబా లాంటి అనేక కంపెనీలు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రూ. కోట్లలో కుచ్చుటోపి వేసి ఉడాయించిన ఘటనలు అనేకం. పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు ఇలాంటి కంపెనీల ఆగడాలను, కార్యాకలపాలను అరికట్టడంలో వైఫల్యం చెందుతున్నారనే విమర్శలున్నాయి. తాజాగా వెలుగుచూసినా వైన్ బాటిల్ కంపెనీ వ్యవహారంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆనాడు పాఠశాలలో గడిపిన స్మృతులను గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదా కబుర్లు చెప్పుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేశారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భార్య కాపురానికి రావడం లేదనే కారణంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొల్లారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. బొల్లారం గ్రామానికి చెందిన గుండ్ల రాజు(33)కు పర్మళ్ల గ్రామానికి చెందిన రక్షణతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక బాబు ఉన్నాడు. ఇటీవల వారి కుటుంబంలో గొడవలు జరగడంతో కారణంగా రక్షణ తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో రాజు మంగళవారం పర్మళ్లకు వెళ్లి తన భార్యను కాపురానికి పంపాలని పెద్దల సమక్షంలో మాట్లాడారు. తనకు ప్రస్తుతం ఆ రోగ్యం బాగాలేదని, కు దుటపడ్డాకా వస్తానని ర క్షణ చెప్పడంతో రాజు బొల్లారం వచ్చేశాడు. భా ర్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.